## "కరిగిపోయిన కల"

మదరాసు త్యాగరాయ నగరం రామస్వామి వీధిలో ఒక పెద్ద మేడ వుంది. సాధారణంగా సంవత్సరంలో పది నెలలు ఆ యింటి తలుపులు తాళాలు వేశి వుంటాయి.ఎప్పుడో ఒక సారి తలుపులు తాళాలు తీస్తారు. రాత్రి పూట యింట్లో దీపాలు వెలుగుతాయి. మనుష్యుల సందడి ఆ వీధిలో వాళ్ళకు వినిపిస్తుంది. మళ్ళీ నాలుగు రోజులలో అంతా మాములే. వచ్చిన వాళ్ళు వెళ్ళిపోతారు. ఇంటిని కాపలాకాసే ముసలి నౌకరు, యింతకాలం నుంచి కనిపెట్టుకుని వున్న నిశ్శబ్దం మళ్ళీ బయటకు వస్తాయి. ఆ యిల్లుయనమండ్ర పేరయ్యశాస్త్రిగారిది. ఆయన బాగా కలిగినవాడు. సొంతముగా ఆస్థి వున్నా తను కూడా వ్యాపారం చేసి బాగా డబ్బు గడించాడు. ఇంటి నిండా సంపదతో బాటు, బండెడు పిల్లలు, మూడు పువ్వులు ఆరు కాయలుగా వుండే వాడు. ఆయనకు యిన్ని మంచి లక్షణాలు వున్నా చంద్రుడికి ఆ మచ్చ వున్నట్టుగా ఆయనకున్న లోపమల్లా ఒకటే. ఇళ్లు కట్టించడం వాటిని ఎవరికి అద్దెకు యివ్వకుండా తాళం వేసి ఖాళీగా వుంచడం. ఆయన సమాధానం ఏమిటంటే అద్దెకు వచ్చిన వాళ్ళు యింటిని పాడుచేస్తారు. పిల్లలు యెదిగి పెద్ద వాళ్ళయ్యేసరికి ఒక్కొక్కడికి ఒక్కొక్క మేడ యివ్వాలి. ఆయనకు ఆంధ్రాలోను, మదరాసులోను దాదాపు ప్రతి పెద్ద పట్టణంలోను ఒక చక్కటి మేడ ఉంది. అందులో మదరాసులో మేడ అంటే నాకు చాలా యిష్టం ఆ మేడలో వున్న రోజులు. నా జీవితంలోమరువరాని మధుర స్మృతులు ఒక దశాబ్దం వెనుక నేను, మణి ఆ యింట్లో వుండే వాళ్లం.

మణి రేడియో ఇంజనీయరింగ్, నేను ఆటోమోబయల్ యింజనీరింగ్ చదువుతున్న రోజులవి. శాస్త్రిగారు మా మణికి అంటే మాసుబ్రహ్మణ్యం మేనమామకు తెలుసు. పైగా మా తాతగారితో బాగా పరిచయం వున్న వ్యక్తి. ఆ మేడలో మేము యిద్దరం వుండి చదువుకునేట్టు మాకు తోటమాలి నంజుడయ్య హోటల్ నుంచి భోజనం అవీ తెచ్చి పెట్టెటట్టు నజుండయ్య కూతురు కన్నియిమ్మ యిల్లు వూడ్చేటట్టు వగైరా ఏర్పాట్లు శాస్త్రిగారే చేశారు. ఆయన అంతటితో వూరుకోలేదు. ఆ వీధిలోనే వుంటున్న కార్పొరేషన్ యింజనియరు నటరాజన్‌ను మా యిద్దరికి గార్డియన్‌గా నియమించాడు. ఇంత పకడ్‌బందిగా ఇన్ని ఏర్పాట్లుతో మేము యిద్దరం చదువు ప్రారంభించాం.

మొదటి సంవత్సరం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా కాలం గడిచిపోయింది. నా చదువు పూర్తి అయిపోయింది. కాని మదరాసు వదిలిరాలేక అక్కడే రెండో సంవత్సరం కూడా వున్నా. జూన్ నెల గడిచిపోయింది. జులై మాసం

వచ్చింది. ఒకరోజున ప్రక్కయింట్లోకి ఎవరో క్రొత్తగా అద్దెకు వచ్చారు. రాగానే యింటికి బోర్డు తగిలించారు.

'బాల చందర్' రేడియో యింజనియర్

సాయంకాలం నేను యింటికి తిరిగి వచ్చే సరికి మణి డాబా మీద నిలబడి వున్నాడు. ప్రక్క యింట్లోంచి ఒక చామనఛాయ చిన్నది. కిటికీ చాటునుంచి యిటు చూస్తోంది. ఇంజనియరింగ్ లెక్కలను గురించి ఆలోచించే ఆ సజ్జనుడు యింకేం గ్రహించే స్థితిలో లేడు.

నేను మేడ మీదకు వచ్చేసరికి చిన్నది మాయమయింది. కిటికీ తలుపులు కూడా మెల్లగా మూసుకున్నాయి.

రెండు నెలలు యిదే వరుసగా గడిచాయి. ఒక రోజు రాత్రి నేను యింటికి ముందుగా వచ్చాను. మనస్సులో ఎందుకనోగాని అంతులేని ఆనందంగా వుంది. సరాసరి డాబా మీదకు వెళ్ళి కూర్చున్నాను. మామిడి కొమ్మల నీడలు వెన్నెల వల్ల మేడ మీద పడుతున్నాయి. నంజుడయ్య కూతురు పువ్వుల దండ కడుతూ తనలోతాను ఏదో పాడుకుంటూంది. దూరంగా ఎవరిదో రేడియోలోనుంచి రవిశంకర్ సితార్ వాయిద్యం వినిపిస్తోంది. ఒక్కసారిగా మనసున మల్లెలు మూలిగినాయి.

పలుక రాదటె చిలుకా అని పాడటం మొదలు పెట్టాను. ప్రక్కయింటి కిటికీ తలుపు తెరుచుకున్నాయి. ఎవరో నా పాట శ్రద్దగా వింటున్నారు. పాట పూర్తి అయింది. కిటికీ చాటునుంచి గాజులు గలగలమన్నాయి.

'అమ్మాయి' అంటూ పిలుపు వినిపించింది. కిటికి తలుపులు తెరిచే వున్నాయి. కాని గాజుల గలగల దూరమయింది. సినిమాకు వెళ్ళిన మణి రవ్వంత ఆలశ్యంగా యింటికి వచ్చాడు. డాబా మీదకు వెళ్ళి నిలబడ్డాడు.

రామం అని పిలిచాడు. నేను వసారాలోకి వెళ్ళాను.

పడుకున్నావా అని అడిగాడు.

లేదు.

ఏదైన ఒక మంచి పాట పాడరా అని అన్నాడు.

నాకు నచ్చిన పాట మళ్ళీ పాడడం మొదలు పెట్టాను.

నాకు అందెల రవళి వినిపించ లేదు. గాజుల గలగల నా చెవికి సోకలేదు. కాని నా మనస్సుకు తెలుసు.

ఆ ప్రక్కయింట్లో కిటికి దగ్గర ఎవరో చామంతి రేకుల వన్నె చిన్నది యీ పాట దీక్షగా వింటోందని.

పాట రాశిన కవిని, సినిమాలో పాట పాడిన ఘంటసాల వెంటేశ్వరరావును ఒకసారి స్మరించుకున్నాను.

మరునాడు సాయంకాలం యింటి దగ్గరే కూర్చుని చదువుకుంటున్నాను. మణి కూడా పెందలాడే తిరిగి వచ్చాడు. స్నానం సంధ్య పూర్తికాగానే అలవాటుగా డాబా మీదకు వచ్చి నిలబడ్డాడు. వచ్చిన వాడు చకచకా క్రిందకు వెళ్ళాడు. ఒక చిన్న కాగితం ముక్క తీసుకుని పైకి వచ్చాడు.

దాంట్లో రెండే వాక్యాలు వున్నాయి. మణిగారూ !

"రాత్రి మీరు పాడిన పాట చాలాబాగుంది. మళ్ళీపాడరూ" క్రింద ఏ విధమైన సంతకం లేదు.

నీ పేరు మణి కాదని, నాకు సంగీతం రాదని చెప్పనా అని అన్నాడు.

వద్దురా. వాళ్ళకు కావలసింది పాట. అంతేగాని నువ్వు నేను కాదు అని అన్నాను.

అదీ పాయింటే అని మణి అన్నాడు.

వెలుగు పోయి చీకటి వచ్చింది. చీకటిపోయి వెన్నెల వచ్చింది. నేను ప్రక్కయింటి అమ్మాయి కోరిన పాట పాడటం మొదలు పెట్టాను. ఈ సారి కిటికీ దగ్గర అలజడి కాలేదు. ఆచిన్నది వాళ్ళ యింటి వసారాలోకి వచ్చి ఒక్కక్షణం నిలబడింది. ఆ ముఖంలో ఏం ఆలోచనలు వున్నాయో. ఆ కళ్ళల్లో ఏమిలమిలలు మెరుస్తున్నాయో నాకు తెలియదు. తెలిసినదల్లా నేను బాగా పాడుతానని అపోహపడేవాళ్ళు కూడా యీ లోకంలో వున్నారు అని.

ఇంటికి ఒకసారి వచ్చి వెళ్ళవలసిందని మరునాడు నాన్న దగ్గ నుంచి ఉత్తరం వచ్చింది. ఆ రోజు బయలుదేరి యింటికి వచ్చేశాను. చూస్తుండగానే నెలరోజులు గడిచిపోయాయి. తిరిగి మదరాసు చేరాను. ఇంటికి వెళ్ళేసరికి మణి యింటి దగ్గర లేడు.

నా దగ్గర వున్న తాళం చెవితో తాళం తీశాను. లోపలకు వెళ్ళి గదిలో లైటు వెలిగించాను.

ప్రక్కయింట్లోంచి మణి నువ్వు వినిపించింది. కిటికీలోంచి చూద్దునుకదా. బాలచందర్ గారి డ్రాయింగ్ రూమ్‌లో ఆయన ఆయన కూతురు. మా మణి కూర్చొని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. దేనికో అంతా కలిసి నవ్వుకుంటున్నారు. అందులో మా మణి నవ్వు మరీ బిగ్గరగా వినిపిస్తోంది.

నా గదిలో లైటు చూసి మణి లేచివచ్చాడు. గేటు దాకా ఆయన అతన్ని దిగబెడితే, వసారాలో నిలబడి, ఆ అమ్మాయి యిటువైపే చూస్తోంది.

నాకు అంతా అయోమయంగా వుంది. తరువాత అసలు కథ తెలిసింది. బాలచందర్‌గారు రేడియో యింజనీయరింగ్‌లో సిద్ధహస్తుడు. మనవాడు కూడా అదే సబ్జక్టులో ప్రత్యేకమైన కృషి చేస్తున్నాడాయె.

ఒక రోజున ఆయనే పలుకరించి పరిచయం చేసుకున్నాడట, ఆ రోజు నుంచి ఆయన మా మిత్రుడికి ఆన్ అఫిషియల్ ట్యూటర్ ఆయనకు ఒకే ఒక కుమార్తె. ఆ అమ్మాయే కమల. ఆ అమ్మాయికి పది సంవత్సరాల వయస్సు వున్నప్పుడు బాలచందర్‌గారికి భార్యావియోగం కలిగింది. అప్పటి నుంచి ఆ కుటుంబంలో ఆ యిద్దరే.

వినాయకచవితినాడు నన్నూ మణిని వాళ్ళ యింటికి భోజనానికి పిలిచారు. మేము ఇద్దరం వాళ్ళ ఇంట్లో గణపతి పూజ చేశాం. నాకు ఒక్కటి అనిపించింది. మణి ఆ యింట్లో మనిషి. నేను మాత్రం పరాయి వాడిని.

భోజనం చేసి డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చుని తాంబూలం వేసుకుంటూ వుండగా కమల.

మీ చిలక పలకటంలేదేం అని అడిగింది.

నేను ఉలిక్కిపడ్డాను.

కమలతో చెప్పేశాను అని మణి అన్నాడు.

ఎందుకని ?

అబద్ధాలు చెప్పి నెగ్గుకు రావడం కష్టం. అందులో ఆడవాళ్ళ దగ్గర మరీ కష్టం.

నా మనస్సులోంచి కొండంత బరువు పోయినట్టు అనిపించింది.

గుడ్ ! బాగుంది అని అన్నాను.

ఇవ్వాళ మా కాలేజీలో మీటింగ్ వుంది. మీరు కూడా తప్పకుండా రావాలి అని కమల అన్నది.

మీరు మాట్లాడుతారా అని నేను నవ్వుతూ అన్నాను.

ఇంకా చాలా మంది మాట్లాడుతారు అని అన్నది.

సాయంకాలం వాళ్ళ కాలేజీకి వెళ్లాం. ఆ రోజు మామూలు మీటింగు కాదు. ఉపన్యాసాల పోటీ అని అక్కడకు వెళ్ళిన తరువాత తెలిసింది.

జనరల్‌హాల్‌లో మూడుభాగాలు చేసి మూడు రకాల బోర్డులు కట్టివున్నాయి. ఉపన్యాసాల పోటీ అని స్త్రీలు పురుషులు, విజిటర్సు నేను మణి విజిటర్సులో కూర్చున్నాం. ఒక కుర్రవాడు వచ్చి మా యిద్దరి పేర్లు అడిగి వెళ్లాడు.

జడ్జిలు వచ్చి స్టేజిమీద కూర్చున్నారు. అందులో నాకు తెలిసిన కృష్ణయ్యగారు

కూడా వున్నారు. ఒక చిరునవ్వుతో అక్కడ నుంచే ఆయన నన్ను పలుకరించారు.

ఈ నాటి పోటీ విషయం 'నా జీవిత లక్ష్యం' అని రాసివుంది భాష హిందీ.

మొట్టమొదట ఒక పంజాబి అమ్మాయి వచ్చి వేదిక మీద నిలబడింది. 'ఎవరు?' అని మణిని అడిగాను. ఎవరో మిస్ పద్మలాల్ వాని అని అన్నాడు ఆ మనిషిని చూడగానే నా మనస్సులో అనిపించిన మాట.

చిన్నారి నీ సొగసే

వెన్నెలలల్లిన చాందిని

ఆ చిన్నది అనర్గళంగా అయిదు నిమిషాలు తన జీవిత లక్ష్యాన్ని గురించి చెప్పింది.

అన్ని విషయాలలోను అందరికన్న మిన్న కావాలని, ఆ చిన్నదాని లక్ష్యం. అభిలాష, ఆరాధన.

ఆ గమ్యస్థానం చేరడానికే నిరంతర ప్రయత్నం ఆగమ్యస్థానం చేరుకోగలమనే ధీమాధైర్యం, ఎవరి దగ్గరనో పుణికి తెచ్చుకుని ఆ ఎలనాగ తనవిగా చేసుకుంది.

నేను మంత్ర ముగ్ధుడిలాగా వింటునాను.

అందరికీ నమస్కారం చేశి ఆ పిల్ల వెళ్ళిపోయింది. కరతాళ ధ్వనులతో నిశ్శబ్దం దూరమయింది.

ఈ శబ్దాన్ని చీల్చుకుంటూ కృష్ణయ్యగారి కంఠం

"తరువాత ఉపన్యాసకుడు ఆటోమొబైయిల్ ఇంజనీయర్ మిష్టర్ రామం" ఆ మాట అర్థం కావటానికే నాకు ముప్పైసెకండ్లు పట్టింది. అర్థం అయిన తరువాత ఒక్కసారి ముచ్చెమటలు పోసాయి.

"నిన్నేరా" అని అంది మణి కంఠం.

నన్ను కాదన్నట్టుగా నేను వూరుకున్నాను.

నావంక చూస్తూ కృష్ణయ్యగారు "రామం" అంటూ పిలిచారు.

నేను అంతవరకూ హిందీలో ఉపన్యాసం ఎన్నడూ యివ్వలేదు. అందుకని మనస్సులో రవ్వంత బెరుకుగానే వుంది.

ఉపన్యాసం ప్రారంభమైయింది.

నేను చెప్పదలుచుకున్న విషయానికి అయిదు నిమిషాలు చాలా ఎక్కువ టైము నిజం చెప్పాలనుకుంటె అయిదు సెకండ్లు చాలు.

ఆశలు అభిలాషలు అందరికీ వుంటాయి. అవి కొందరికే తీరుతాయి ఆదర్శాలు అభిలాషలు వుండగానే సరికాదు. వాటిని సాధించగల స్తోమత సత్తువ కూడా

వ్యక్తిలో వుండాలి. లేకపోతే జీవితం ఎండమావుల వెంట పరుగెత్తడం అవుతుంది. సాధనలో శాంతి ఆనందం లభించవు సరికదా అపజయం వల్ల నిరాశ దుఃఖం ఏర్పడి. ప్రపంచమన్నా దాంట్లో వున్న వ్యక్తులన్నా ద్వేషం ఏర్పడి రగిలిన ఆశలు రేకెత్తిన కోరికలు అడియాశలు కాగా చివరకు ద్వేషమే మిగులుతుంది.

అందరికన్న మిన్న కావాలని అందరిచేత ఔననిపించుకోవాలనే ఆశలు నాకులేవు. అంతటిమహోన్నత శిఖరాలను చేరాలని కాదు కదా తేరిపారచూసే ధైర్యం కూడా నాకు లేదు.

నేను సామాన్య మానవుడిని సామాన్య మానవుడికి ఉండే ఆశయాలే నాకూ వున్నాయి.

కాని వాటితో నా మనస్సుకి సంతృప్తి లభించడం లేదు. మన చుట్టూ యింత విజ్ఞానం వుంది. ఎన్నో భాషలు వున్నాయి. వాటిని అన్నింటిని మనం ఆకళింపు చేసుకోలేము. కాని నా మనస్సు ఎప్పుడూ వాంఛించేది ఒకే ఒక విషయం.

క్రొత్త విషయాలు తెలుసుకుందామని క్రొత్త భాషలు నేర్చుకుందామని సదా విద్యార్థిగా వుందామని నా ఆకాంక్ష.

ఇదే నా జీవిత లక్ష్యమని మీరు అంటె నాకు అంగీకారమే, సంతోషమే- థాంక్యూ.

అని సభికులకు నమస్కరించి కూర్చున్నాను. నా ఉపన్యాసం టైము కంటె ఎక్కువ సేపు చప్పట్లు కొట్టారు.

మణి కమల నా వంక ఎవరో క్రొత్త వ్యక్తి వంక చూశినట్టు చూశారు.

తరువాత చాలామంది మాట్లాడారు. వాళ్ళేం మాట్లారో నాకు గుర్తులేదు కాని, గుర్తు వున్నదల్లా వాళ్లంతా నాకంటె చాలా బాగా మాట్లాడారు.

చివరకు అధ్యక్షులవారు బహుమతులు యివ్వడం కూడా జరిగింది. మిస్ లాలువానికి ఒక ప్రైజు వచ్చింది. ఆశ్చర్యపడలేదు కాని అన్నింటి కంటే ఆశ్చర్యం. నాకు కూడా ఒక ప్రైజు వచ్చింది. మొట్టమొదట సారిగా కమల నాతో చనువుగా మాట్లాడింది. ఇంటికి వచ్చి వరండాలో కూర్చున్నాం.

"మీకు యింత బాగా హిందీ వచ్చునని నాతో ఎప్పుడూ చెప్పలేదేం !"

హిందీ రాదు కాబట్టి.

మీరు భలేవారు అందరి కంటె మీరే బాగా మాట్లాడారు.

అది మీరు అభిమానం కొద్దీ అంటున్న మాట.

నిజం చెప్పినా మీరు నమ్మటం లేదు.

ఇష్టుల యడల అబద్దంకూడా నిజం లాగానే కనిపిస్తుంది.

"అల్లా అంటే మీతో మాట్లాడను"

ఇల్లా సంభాషణ జరుగుతూవుండగా నాకు యింటి దగ్గర నుంచి టెలిగ్రాము వచ్చింది.

"పెళ్ళి చూపులకు వెళ్ళాలి వెంటనే రమ్మని"

'చదువూ సంధ్యాలేని నాకు పిల్లనిచ్చే పిచ్చివాడు ఎవరా ?" అని నవ్వు వచ్చింది. అయినా తప్పుతుందా. ఇంటికి వెళ్ళాను. ఉన్న బలగమంతా తరలి వెళ్లాం.

పిల్లని చూస్తే మావాళ్ళకు నోట మాట రాలేదు. చదువుల సరస్వతి, అందాల భరిణి, గాన కోకిల అక్కడే తాంబూలాలు పుచ్చుకునేటందుకు మావాళ్ళు సిద్ధపడ్డారు.

మా వుబలాటం చూసి కన్యాదాత రవ్వంత తటపటాయించాడు. మొగపెళ్ళివారి యింటి దగ్గర తాంబూలాలు పుచ్చుకోవటం ఆచారం. ఆనవాయితీ అని సవినయంగానే మనవి చేశాడు.

మేము ఏనుగెక్కినంత సంబరంతో ఇంటికి తిరిగి వచ్చాం. మా అమ్మమ్మ, అమ్మ, నాన్న, మా రామానికి పెళ్ళి కాబోతుందని ఆనందపడ్డారు.

పదిరోజులు గడిచాయి. పదిహేను రోజులు గడిచాయి. ఆ వూరి నుంచి మనిషి కాదు కదా కనీసం కాకిచేత కూడా కబురు రాలేదు. సరే యింకొక నాలుగురోజులకు మా కాకే అటు వెళ్ళి అసలు వార్త చల్లగా తీసుకుని వచ్చి మా చెవిని వూది తన దోవన చక్కాపోయాడు.

"పిల్లవాడు పిల్లకు నచ్చలేదు"

ఆ వార్త రావడమేమిటి యింట్లో లంకా దహనమంత పని జరిగింది.

అమ్మమ్మ మామ్మ, అమ్మ, వగైరా స్త్రీజనమంతా ఆ పిల్లలో తమకు కనబడిన లోపాలన్ని ఒక్కసారి పనస చదివినట్టు చదివి వల్లించి.

"మొగ బిడ్డకు నష్టమేమిటి కో అంటె కోటి మంది పిల్లనిస్తారు." అని నన్ను సముదాయింటి వాళ్ళ పనులలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

పైకి నవ్వుతూనే వున్నా లోపల బాధగానే వుంది. ఈ మగరాయుడిని ఒక చిన్నది తోసి రాజన్నది. నన్ను చులకన చేసింది. నిరాకరించింది. తనకు నీడ నివ్వడానికి తగనివాడని, నలుగురి ముందర వెల్లడి చేసి నన్ను యింత అవమాన పరుస్తుందా ?

అయినా యీ కాలపు ఆడపిల్లలంతే ! చిన్న పిల్లల పెళ్ళిల్లే హాయి ! ఏదో పెద్దవాళ్ళు ఏర్పాటు చేసి మూడు ముళ్ళు వేయిస్తారు. మంచో, చెడో, సంసార మంటూ సాగిపోతుంది.

"రామం !" అంటూ నాన్న కంఠం వినిపించింది. నా 'బిక్క' ముఖం చూసి ఆయన నన్ను ఓదారుస్తూ.

ఇంతమాత్రం దానికే ఎందుకురా యిల్లా బాధపడతావు ! మీ అమ్మ కూడా మొదట్లో యిలాగే వుంది. అంతమాత్రాన మా పెళ్ళి తప్పిందా ? లక్షణంగా కాపురం చేస్తోంది. రాసి వుంటే ఎవరు తప్పించగలరు చెప్పు.

"రేపు మదరాసు వెడుతున్నా"

"అలాగే ! దీన్ని గురించి బాధ పడకు. ఇది కాకపోతే యింకొకటి."

మర్నాడు గ్రాండు ట్రంకులో బయలుదేరి మదరాసు వచ్చాను. నేను రూముకు చేరే సరికి రాత్రి తొమ్మిది అయింది. మణి లేడు. నంజుడయ్యని అడుగుతే, ప్రక్క యింటి వాళ్ళతో కలిసి సినిమాకు వెళ్ళాడని తెలిసింది.

భోజనం చేసి పడుకున్నాను. పది దాటిన తరువాత మణి వచ్చాడు.

మంచి వుషారుగా వున్నాడు. నన్ను చూసిప్రక్కలో కూర్చొని "హలో రామం" అని అన్నాడు.

హలో.

ఇంట్లో అంతా కులాసా ? పెళ్ళెప్పుడు.

పిల్లకు నేను నచ్చలేదు.

డోంట్‌వర్రీ దాన్ని తలదన్నేపిల్ల యింకొకర్తె వస్తుందిలే.

సరిగ్గా మానాన్న అన్నట్టుగానే అంటున్నావే.

మొగవాడు ఎవరైనా సరే అనే మాట అదే.

గుడ్‌నైట్.

పడుకో ! గుడ్‌నైట్

మర్నాడు ఉదయం మణి ఎక్కడికో హడావిడిగా తయారువుతున్నాడు.

మహాబలిపురం వెడుతున్నాం రాత్రి కల్లా వచ్చేస్తాం.

సరే.

పోనీ నువ్వు కూడా వస్తావా ?

ఎవరెవరు వెడుతున్నారు.

కమలవాళ్ళ బంధువులు ఎవరో వచ్చారు. వెడుతున్నాం.

కమల కూడా వస్తోందా ?

ష్యూర్ ?

Then go ahead. Where two is company three is crowd.

థాంక్యూ, అంటూ నవ్వుకుంటూ మణి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్నా. నిద్దర లేచేసరికి సాయంకాలం నాలుగైంది. స్నానం చేసి డ్రస్ చేసుకొని మెరినాకు వెళ్లాను. గంట అయిదు అయినా ఎండ మెండుగానే వుంది. ఇప్పటి నుంచి యిసుకలో పడి ఏం అఘోరిస్తా మని అనుకొని, ఆక్వేరియం హోటలులోకి వెళ్లాను. ఇంకా అట్టే జనాభా లేకపోవడం వల్ల అంతా పలచ పలచగానే వుంది. నేను మామూలుగా కూర్చునే చోటుకు వెళ్ళాను. అక్కడ నుంచి సముద్రం బాగా కనిపిస్తుంది. ఇద్దరు ఆడపిల్లలు ఆ బల్ల దగ్గర కూర్చొని వున్నారు. నేను యింకొక బల్ల దగ్గరకు వెళ్ళబోతూ వాళ్ళ వంకపరకాయించి చూశాను. గులాబీరంగు చీర కట్టుకున్న ఒక పిల్ల యింకొక పిల్లతో మాట్లాడుతోంది. నేను ఆగడం చూశి నా వంక ఒక్క క్షణం చూసి చిరునవ్వు నవ్వింది అప్పుడు ఆ వ్యక్తి గుర్తుకు వచ్చింది.

"పద్మ లాల్‌వాని" మీటింగ్ రోజున పంజాబి డ్రస్‌లో వుంది. ఈ రోజున చీర కట్టుకుంది. అందుకనే పరిస్థితి అర్ధం కావటానికి అరనిముషం పట్టింది.

నేను "హల్లో" అని అన్నాను.

"నమస్తే" అని పలికింది.

"కులాసా"

థాంక్యూ ! ఫ్రెండ్స్‌తో వచ్చారా.

లేదు ఒంటరిగానే వచ్చాను.

కూర్చోండి. ఈవిడ నా ఫ్రెండ్ మిస్‌షీలా అని పరిచయం చేశింది. షీలా రెండు నిముషాలు మా దగ్గర కూర్చొని మామూలు మాటలు మాట్లాడి వెళ్ళిపోయింది.

ఆ రోజున మీరు చాలా బాగా మాట్లాడారు.

మీ కంటేనా

నేను హిందీ మాట్లాడే ప్రాంతంలో పుట్టి పెరిగిన దాన్ని, మీరు దక్షిణాదినే వుండి యింత బాగా మాట్లాడారు. చాలా ఆశ్చర్యం కాదూ.

నా ఉపన్యాసం మీ ఒక్కరికన్నా నచ్చింది అదే సంతోషం.

నేను నిజంగా చెబుతున్నాను. నాకు చాలా నచ్చింది. మీటింగు అయిన తరువాత మిమ్మల్ని కలుసుకుందామని నేను షీలా అనుకున్నాం కాని.

సిగ్గుపడి ఉంటారు.

నిజం !

ఇప్పుడైనా మంచిది ! మన ఒకరి కొకరం యింట్రడ్యూస్ చేసుకుందాం. నా పేరు "రామం" విద్య ఉద్యోగం రెండూ లేనివాడిని. పెద్దలు యిచ్చే డబ్బు తీసుకువచ్చి యీ వూళ్ళో కాలక్షేపం చేస్తూ వుంటాను.

పద్మ ఒక్కక్షణం మాట్లాడలేదు ముఖంలో బాధ కనిపించింది. వెంటనే చిరునవ్వు వచ్చింది.

లేని వాళ్ళేగా ఉద్యోగాలు చేసేది. మీకు అవసరం లేదనుకుంటాను.

మీరు

నా పేరు పద్మ. క్వీన్ మేరిస్‌లో బి.ఎ. చదువుతున్నాను. వారానికి రెండు సార్లు హిందీ కాలేజీకి వస్తాను. మా నాన్నగారు ఇక్కడ ఒక యింజనియరింగ్ ఫరమ్‌కు జనరల్ మేనేజరుగా వుంటున్నారు.

కాఫీ త్రాగడం పూర్తి చేశి యిద్దరం బయట యిసకలో వచ్చి కూర్చున్నాం.

"మీరు" హిందీ ఎక్కడ నేర్చుకున్నారు?" అని హిందీలో అడిగింది.

స్వయంగానే

నిజం ! ఇంత మంచి ఉచ్చారణ ఎల్లా వచ్చింది ?

రేడియోలో హిందీ పాఠాలు విని, పుస్తకాలు చదివి

మీరు అసాధరణమయిన వ్యక్తులు

అసలు విషయం తెలియనంత కాలం అంతా అల్లాగే కనిపిస్తారు.

మీ స్పీచ్ విని నేను చాలా యింప్రెస్ అయ్యాను. ఎంత పాలిష్‌గా మాట్లాడారు! తరుచూ ఉపన్యాసాలు యిస్తూ ఉంటారా ?

మీరు మొన్న విన్నదే మొదటిది.

నేను నమ్మను.

అబద్దాన్ని నిజంగా నిరూపించవచ్చు కాని నమ్మని వాళ్ళ ఎదుట నిజాన్ని నిజంగా నిరూపించటం చాలా కష్టం.

మీరు తమాషాగా మాట్లాడతారు.

థాంక్యూ

దేనికి ?

మీరిచ్చిన కాంప్లిమెంటుకి

నమ్మకూడని వాళ్లకు నిజం కూడా కాంప్లిమెంటులాగా కనిపిస్తుంది.

మీరు లాజిక్కు తీసుకోవలసింది.

ఇప్పుడు వీలులేదుగా

బి.ఎ. తరువాత ఏం చదువుతారు.

ఎమ్.ఎ.ఫిలాసఫి.

అప్పుడు మీతో మాట్లాడలేము.

ఎందుకని !

"బి.ఎ.లోనే యింత తర్కంగా మాట్లాడే వారు రేపు "మెటాఫిజిక్సు" "మిష్టిసిజమ్" వగైరా వగైరా చదివి విదుషీమణులైన తరువాత మీతో వాదించటం మా శక్తికి మించిన పని"

ఎంత చదివినా నేను మీకంటే చిన్నదాన్నే

వయస్సులోనా

కాదు ! అన్నింటిలోనూ

ఎందుకని !

అది అంతే

క్రాస్‌వర్డు పజిల్సు మానెయ్యండి

నాకు అలవాటు లేదు

అయితే మీరు మాట్లాడేదేమిటో యీ అజ్ఞానికి అర్థమయ్యే భాషలో చెప్పండి.

పద్మ ఒక్క క్షణం ఏం మాట్లాడలేదు.

"వెళ్లిపోదామా" అని అడిగాను.

"వెడదాం" అంటూ బయలుదేరింది.

ఇద్దరం ప్రెసిడెన్సీకాలేజి దగ్గరకు వచ్చాం

"మీ బస ఎక్కడ" అని అడిగింది.

నెం. 8 రామస్వామి స్ట్రీట్, త్యాగరాయనగరం

మా యిద్దరి దగ్గరకు ఒక నల్లటి ఫియట్ కారు వచ్చి ఆగింది. డ్రైవరు దిగి తలుపు తీశాడు.

"రండి. మీ యింటి దగ్గర డ్రాపు చేస్తాను అని పద్మ అన్నది.

"మీకు అనవసరమైన శ్రమ"

శ్రమ పడేది నేను కాదుగా, కారు అని అంది.

నాకు వక్కసారి నవ్వు వచ్చింది.

"దేనికిలేండి, బస్సులో వెళ్ళిపోతాను"

పద్మ నావంక ఒక్కక్షణం మౌనంగా చూశింది. అంతలోనే కోపం నటిస్తూ

"మీ యింటికి నేను రావడం యిష్టం లేదన్నమాట" అని అన్నది. నేనేం మాట్లాడకుండా కారులో ఎక్కి కూర్చున్నా.

తనుకూడా కారులో కూర్చొని 'థాంక్యూ' అని అన్నది

ఆ మాట అనవలశింది నేను

ఎందుకని ?

మీరు చూపించే ఆత్మీయతకు, అభిమానానికి, కృతజ్ఞత చెప్పుకోవలసిన వాడిని నేను.

పద్మ ఏం మాట్లాడలేదు. చిరునవ్వుతో ఏదో ఆలోచిస్తోంది.

నాకు మాత్రం ఎందుకనో గాని మనస్సులో ఒక మాట అనిపించింది. ఈ పంజాబీ వాళ్ళు ఎంత విచిత్రమైన వ్యక్తులు. మనుష్యులలో ఎంత చొరవా, ఎంత ధైర్యం ఉన్నాయి.

హిందీలో ఏవైనా పరీక్షలు ప్యాసు అయ్యారా అని ఆ అమ్మాయి అడిగింది.

లేదండి.

చదవండి మీరు తప్పక ప్యాసుకాగలరు.

నేనేం మాట్లాడలేదు. ఇల్లు సమీపించింది. అప్పుడు నా మనస్సులో మరొక సమస్య వచ్చింది.

నేను బ్రహ్మచారిని. యీ పిల్ల మా గార్డియన్‌కు తెలియదు యీ అసురసంధ్యవేళలో యీ మనిషిని మా రూమ్‌కు తీసుకువెళితే ఎన్ని అనర్థకాలకైనా దారి తీయవచ్చు. అని ఎందుకనో మనస్సుకు అనిపించింది.

కారు కమలా వాళ్ళ యింటి దగ్గరకు రాగానే కారు ఆపించాను. రండి అని అంటూ ఆ అమ్మాయిని ఆహ్వానించాను.

ఇంటి ముందు కారు ఆగిన స్వవడి వినబడగానే కమల వరండాలోకి వచ్చి నిలబడింది. నన్ను చూడగానే చిరునవ్వుతో పలుకరించబోయి, అంతలోనే ప్రక్కనున్న వ్యక్తి కంటబడగానే గతుక్కుమని మేము తనని దరిచేరే రెండు క్షణాలలోనే మూడ కన్నులలో వెయ్యి నొక్క ప్రశ్నలు శర పరంపరలుగా కుప్పించి వేశింది.

ఎవరు యీ అమ్మాయి ? యీ అమ్మాయితో నీకు పరిచయం ఎల్లా అయింది?

మీ యిద్దరూ మా యింటికి రావడంలో ఉద్దేశ్యం ఏమిటి ? వగైరా ప్రశ్నలు అనేకం కనిపించాయి, వినిపించాయి.

ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్పకుండా, పద్మను కమలకు పరిచయం చేసి, యింట్లోకి వెళ్లాం. వాళ్ళ డ్రాయింగ్‌రూమ్ లోకి వెళ్ళి కూర్చొగానే మొదటి ప్రశ్న వేశాను.

మహాబలిపురం నుంచి అప్పుడే వచ్చేశారేం ?

అక్కడ విపరీతమైన వానగా వుంది. తిరిగి వచ్చేశాం.

మణి ఏడి !

రూమ్‌లో వున్నారు.

నేను వెళ్ళి మణిని పిలుచుకుని వచ్చాను. వాడు వచ్చి వంక ఒక్క క్షణం పరకాయించి చూశాడు. నేను పద్మను పరిచయం చేయ్యగానే

గ్లాడ్ టుమీట్ యు అని అమ్మాయితో అని నా వంక చూసి శుభం అని అన్నాడు.

కమల నవ్వింది.

అర్థం కానట్టు పద్మ మా వంక చూశింది.

మీరు వాళ్ళ యింట్లోకి రావడం చాలా శుభప్రదమని మా మిత్రులు భావిస్తున్నారు. అని పద్మతో అన్నాను.

పద్మ ముఖంలో సంతోషం కనిపించింది. మిమ్మల్ని అందరిని కలుసుకోవడం వల్ల నాకు చాలా ఆనందంగా వుంది అని అంది.

రెండు నిముషాలలోనే కమల పద్మ చాలా దగ్గర స్నేహితులయ్యారు. కమల యిచ్చిన కాఫీ త్రాగి పద్మ యింటికి వెడతావంటూ లేచింది. మేమంతా కారు దగ్గరకు వచ్చాం.

పద్మ కారులో కూర్చొని తలుపు వెయ్యబోతూ నా వంక చూసి శనివారం మీకేమైనా పని వుందా అని అడిగింది.

నేను ఒక్కక్షణం తటపటాయించి

ఏమీ లేదు

మా యింటికి మీరంతా తప్పకుండా టీ కి రావాలి

కమల మణి ఒకరి వంక ఒకరు చూచుకున్నారు.

నేను థాంక్యూ అని అన్నాను.

నెం. 24 'సి.సి. రామస్వామి అయ్యర్ రోడ్డు' అన్నామలైపురం అంటూ తమ

అడ్రసు చెప్పి తప్పకుండా రావాలి అంటూ యింకొక సారి హెచ్చరికచేశి వెళ్లిపోయింది.

కారు సందు మలుపు తిరిగి ఉస్మాన్ రోడ్డు మీదకు వెళ్లిపోయింది.

నేను రూమ్‌కు వెడదామని బయలుదేరబోయాను. మణి ఒక్క అడుగు ముందుకు వేసి

కంగ్రాచ్యులేషన్స్ అని అన్నాడు.

కమల కొంటెగా నవ్వి ఏమో అనుకున్నాను. మీరు భలే అసాధ్యులు అని అన్నది.

నేనే మాట్లాడలేదు. సరాసరి రూమ్‌కు బయలుదేరాను గేటు దగ్గర కన్నియమ్మ నిలబడి వుంది.

ఎవరండీ అమ్మగారు ? అని అరవంలో అడిగింది.

ఏం !

మీ ప్రక్కన నిలబడితే చాలాబాగున్నారు అని అన్నది.

నేను ఒక్కక్షణం ఆగి నీ ప్రక్కన నిలబడే వాడూ వస్తాడులే, తొందరపడకూ అని అన్నాను అతికోపం నటిస్తూ

ఫో స్వామీ అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

రెండు రోజులు గడచిన తరువాత శనివారం వచ్చింది. శనివారం గురించి నేను అట్టే శ్రద్ధ తీసుకోకపోయినా మణి మాత్రం జ్ఞాపకం పెట్టుకున్నాడు.

కాలేజీకి వెళ్ళబోతూ రామం అయాం సారీ, నేను సాయంకాలము ఆలస్యంగా వస్తానురా మాకు కాలేజీలో సైంటిఫిక్ సెమినార్ వుంది. మీ ఫ్రెండు వాళ్ళ యింటికి రాలేనందుకు ఎక్స్క్యూజ్ చెప్పరా అని అన్నాడు.

ఓ కే అని నేను అన్నాను.

వాడు కాలేజీకి వెళ్ళిన పదినిముషాలకు బాలచందర్ గారు వచ్చారు. సాయంకాలము తనూ వాళ్ళ అమ్మాయి ఏదో ఆకస్మాత్తు అర్జెంటు పనిమీద వెళ్ళవలసి వుందని అందుకని పద్మ వాళ్ళ యింటికి రాలేనని కమల చెప్పమని చెప్పమన్నదని తెలియపరచాడు.

ముగ్గురిలో మిగిలినదల్లా నేనొక్కడినే.

నాకు కాలేజీలో సెమినార్ కాని ఆకస్మాత్తుగా అర్జెంటు పనిగాని లేవు. అంతే గాదు నా ఉపన్యాసాన్ని అంత ఖచ్చితంగా మెచ్చుకున్న మనిషి నాకు పిలిచి అతిథ్యం యిస్తానంటే తిరస్కరించిన నాకు మహా పాపం చుట్టుకుంటుంది. తప్పక వెళ్ళాలి.

మనస్సుకు యీ నిర్ణయం రావడమేమిటి కాలు నిలువలేదు. ఎప్పుడు నాలుగు గంటలు అవుతుందా అని గడియారం వంక చూస్తూ కూర్చున్నాను. ఒంటి గంట కొడుతూ వుండగా రెండవ డెలివరీ పోస్టు వచ్చింది. నాకు పరిచయం లేని దస్తూరితో ఒక ఉత్తరం వచ్చింది.

ఆకస్మాత్తుగా ఢిల్లీ వెళ్లిపోతున్నాం నెల రోజులలో తిరిగి వచ్చేస్తాం. రాగానే తప్పక మా యింటికి రావాలి. ఏమీ అనుకోరు కదూ. నన్ను క్షమించండి పద్మ.

పైన తలకట్టు లేదుకాని కింద సంతకం వుంది. కవరు మీద నా అడ్రసే వుంది కాబట్టి యీ ఉత్తరం నాకే.

ఆ ఉత్తరం తీసుకువెళ్ళి కమలకు చూపించాను.

అయాంసారీ ! అని అన్నది.

నేను నవ్వాను. నా వంక ఆశ్చర్యంగా చూసింది.

చాలా మంచి మనిషిలాగా వుంది అని కమల అన్నది.

నేనేం మాట్లాడలేదు మా యింటి వంకనే చూస్తూ వున్నాను. కమల కూడా అటువైపే చూసింది.

ఎదురింట్లో పనిచేసే కుర్రవాడు మా యింటి గేటులోకి వస్తున్న కన్నియమ్మని చూసి ఏదో వినిపించీ వినపడనట్టు అన్నాడు.

అది ఆగి భయంగా మేము వున్న చోటుకు చూసింది.

మేము తనవంక చూడలేదని అనుకుని వాడివంక చూసి చిరునవ్వు నవ్వింది. వాడు తన దగ్గర వున్న సంపెంగ పువ్వు ఆ పిల్లకు యిచ్చాడు.

యీ దృశ్యం చూసి నేనూ కమలా బిగ్గరగా నవ్వాం. వాళ్ళిద్దరూ తూనీగలలాగా పారిపోయారు.

నేనునవ్వుతూ "కాదల్" (ప్రేమ) అని అన్నాను.

కమల కూడా నవ్వుతూ "ఆమా !" (అవును) అని అన్నది.

ఆ రోజు నుంచి నా జీవితమొక క్రొత్త మలుపు తిరిగింది. పైకి మామూలుగా వున్నా నా మనస్సు మాత్రం రోజులు లెక్క పెడుతోంది. నెలరోజులు అంటె ముప్ఫై రోజులు గడిస్తేనే కాని నన్ను మెచ్చుకుని, నా స్నేహాన్ని కోరిన వ్యక్తి యీ మహా నగరానికి తిరిగిరాదు. తన ఢిల్లీ అడ్రసు యిస్తే ఎంత బాగుండేది.

కాని ఎంత ఆశ్చర్యం ! కొందరితో మన జీవితమంతా గడుపుతాం కాని వారి వల్ల మన జీవితంలో ఎటువంటి మార్పూరాదు. మెరుపు లాగా వచ్చిన యీ వ్యక్తి కొద్దిక్షణాలు మాత్రం పరిచయం వున్న యీ వ్యక్తి కోసమని నా మనస్సు ఎందుకని

యింత ఎదురు చూస్తోంది.

ఎవరం ? మేమెవరం ? ఎందుకీ అనుబంధం ?

ఈ ఆలోచనలే తరుచూ మనస్సుని మధనం చేసేవి.

ఈ ప్రశ్నలు ఎందుకని నేనెవ్వరిని అడగలేదు. వీటికి సమాధానం ఏమిటని కూడా నేను ఎవ్వరిని ఆర్థించలేదు.

ఇరవై ఆరు రోజులు యిలా గడిచాయి. ఆ రోజు తిధి ఏమిటో నాకు తెలియదు. కాని తెలిసినదల్లా ఆ రోజు రాత్రి ఆకాశం మీద చందమామ నిండుగా వున్నాడు.

పుచ్చపువ్వు లాంటి వెన్నెల వెర్రిగా కాస్తోంది. వెన్నెల వెలుగు కొబ్బరి ఆకుల మీద పడి అవి వెండి రేకుల లాగా మెరుస్తున్నాయి.

నా మనస్సు ఎందుకనో ఒక్కసారిమూగబోయింది. హృదయమంతా నిశ్శబ్దంతో నిండిపోయింది. ఈ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఎక్కడిదో పాట వినవచ్చింది.

ఎంత హాయి యీ రేయి నిండెనో

ఎన్ని నాళ్ళకు యీ బ్రతుకు పండెనో

మనసున మల్లె మాలలూగెనో...

ఓరేయి భానుమతి ! అంటూ మా మణికంతం నన్ను పిలిచింది.

నేను ఉలిక్కి పడ్డాను.

ఏమిటిరా యీ విరహం అంటూ ఎదురు సవాల్ వేశాడు.

నేను నవ్వి వూరుకున్నాను.

రామం, ఒక శుభవార్త చెప్పనా ?

చెప్పు.

అమెరికా వెడుతున్నాను.

నిజం !

కాలేజి వాళ్ళు యిద్దరు స్టూడెంట్సుకు స్కాలర్‌షిప్ యిస్తున్నారు. అందులో నన్నూ, పరమశివన్ మొదలియారును సెలక్టుచేశారు.

కంగ్రాచ్యులేషన్సు, మరి మాకు పార్టీ ఎప్పుడూ... కమలతో చెప్పావా.

ఇంట్లో లేదు. హిందీ విద్యాసాధానికి వెళ్లింది. రాగానే చెబుతాను.

ఎప్పుడు వెడుతావు.

యింకా రెండు మూడు నెలలలో

జనవరిలోనా.

అప్పుడే.

ఇంటికి టెలిగ్రాము యిచ్చావా.

కాలేజి నుంచే యిచ్చాను.

ఇంతలో కమలా వాళ్ళ యింట్లో దీపం వెలిగింది.

కమలతో చెప్పి వస్తాను. అంటూ వాడు అక్కడకు వెళ్ళాడు. అయిదు నిమిషాలు గడిచాయో లేదో కాని, మణి అక్కడ నుంచే రామం ! అంటూ పిలిచాడు.

నేను కూడా కమలా వాళ్ళ యింటికి వెళ్ళాను.

అక్కడ కమల సోఫాలో కూర్చొని ముఖం చేతుల్లో కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఏం జరిగింది. కమలా అని మణి అడిగాడు.

ఎవరన్నా ఏమన్నా అన్నారా అని నేను అడిగాను.

ప్లీజ్ గో ఎవే అని కమల అన్నది. నేను ఏమీ అనలేక వరండాలోకి వచ్చి నిలబడ్డాను.

కమలా, ప్లీజ్ ఏం జరిగిందో చెప్పవూ.

కాలేజీలో అంత తలోక రకంగా అంటున్నారు.

ఏ విషయం ?

కమల ఏం మాట్లాడలేదు.

మన విషయమేనా !

అవునన్నట్లుగా కమల తల వూపింది.

కొద్ది క్షణాలు యిద్దరూ ఏం మాట్లాడలేదు.

నన్ను పెళ్లి చేసుకుంటావా కమలా అని మణి అడిగాడు. ఐ లవ్ యు.

కమల తలవంచుకునే మెల్లిగా నాన్నగారితో చెప్పండి అని అన్నది.

మరునాడు కమలా వాళ్ళ నాన్నగారు మణి నాన్నగారికి ఉత్తరం రాశారు. ఆ ఉత్తరంతో బాటు మణి కూడా కమల విషయం వాళ్ళ నాన్నగారికి అమ్మకు తెలియపరిచాడు. ఈ రెండు ఉత్తరాలకు సమాధానంగా వారంరోజులలో మణి వాళ్ళనాన్న గారు అతని మేనమామ మదరాసు వచ్చారు. లాంఛనంగా పెళ్ళి చూపులు జరిగియి. ఆ పెళ్ళి చూపులలో మాకు యింతవరకూ నిర్ధారణగా తెలియని విషయం ఒకటి బయటపడింది.

కమల చాలా చక్కగా పాడుతుందని. ఇంతకంటె ఆశ్చర్యకరమైన విషయం

మణివాళ్ళ మేనమామకు యుక్తవయస్కురాలైన కుమార్తె వున్నదని ఆ చిన్నారిని నాకు యిచ్చి వివాహం చెయ్యాలని వున్నదని, ఆయన వ్యక్తం చెయ్యడం జరిగింది.

అక్కడితో ఆ వ్యవహారం పూర్తికాలేదు. పిల్లదాని ఫొటో కూడా ఆయన వెంటపట్టుకునే వచ్చాడు.

పిల్ల చాలలాబాగుంది. అందులో సందేహం ఏం లేదు. అందగత్తే! కాని నాకు వచ్చిన సందేహమల్లా యీ పిల్లని గురించి మణి నాతో ఎన్నడూ చెప్పలేదే ! మేనరికం వుండగా బయట సంబంధం గురించి ఆయన చూడవలసిన అవసరం ఏం వచ్చింది ?

ఆయన చెప్పి సమాధానం నాకు సబబుగానే తోచింది. జాతకాలు కలవలేదు.

ఈ మాట విన్న తరువాత ఆ పిల్ల ఫొటో మళ్ళీ తీరికగా చూశాను. చూస్తున్నంత సేపూ నా మనస్సులో మసిలిన ప్రశ్న ఒకటే.

ఈ పిల్లను ఎక్కడో చూశాను. ఎక్కడ ? ఎప్పుడు ?

నేను ఫొటోవంక అదేపనిగా చూస్తున్నానని కాబోలు ఆయన పిల్ల బంగారు చాయ అని అన్నాడు.

బంగారు ఛాయ ! అన్నమాట నా చెవిని పడగానే నా మనస్సు ఒక్కసారి ఉలిక్కిపడ్డది. ఆలోచనల మెరుపు మెరిసింది.

పద్మాలాల్‌వాని తను చెప్పిన నెలరోజుల గడువు తీరిపోయింది ఇప్పటికి వచ్చేసి వుండాలి.

వెంటనే కూర్చున్న వాడిని లేచాను.

నువ్వు ఒక్కసారి వీలుచేసుకుని అమ్మాయిని చూశివెళ్ళాలి. నాన్నగారికి ఉత్తరం రాశాను. మా అమ్మాయి అని చెప్పడం కాదు కాని రామం అటువంటి పిల్ల వెయ్యిమందిలో ఒకరు కూడా వుండదనుకో, నువ్వే చూస్తావుగా.

నాకు నవ్వు వచ్చింది.

రామం ! అంటూ బాలచందర్‌గారు పిలిచారు, మనమంతా యీ వారంలో మణి వాళ్ళవూరు వెళ్ళి తాంబూలాలు యిచ్చి రావాలి యీ విషయంలో నువ్వు ఆడపెళ్ళి వారి పార్టీ అని అన్నాడు.

అలాగేనండి అని అన్నాను.

ఒరేయి మణి అంటూ వాళ్ళ మేనమామ పిలిచాడు. రామాన్ని మనవూరు తీసుకుని వచ్చి శ్యామలను చూపించి అవుననిపించే బాధ్యత నీది అని అన్నాడు.

తప్పకుండా మామయ్య అని మణి అన్నాడు.

మరునాడు ఉదయం వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయారు. నేను మణి మిగిలాం !

కమల మణిని చూసి సిగ్గుపడటం మొదలు పెట్టింది.

ఆ మధ్యాహ్నమే నాకొక ఉత్తరం వచ్చింది. “ మేము తిరిగి వచ్చేశాం. సాయంకాలం మా యింటికి రావాలి” పద్మ.

యిద్దరూ కూడబలుక్కున్నట్లు ఒకే మాట అన్నారు.

“గుడ్‌లక్”

దానికి అర్థం వాళ్ళిద్దరూ రారని నన్ను ఒక్కడినే వెళ్ళిరమ్మని. అరఘడియ దాటితేనే గాని గ్రాహ్యంకాలేదు.

సరే నేను ఒక్కడినే పద్మవాళ్ళ యింటికి వెళ్ళాను. వెళ్లడం మామూలుగా కాదు. రాజు వెడలె రవితేజము లలర... అన్న పద్ధతిలో మస్తు ముస్తాబై యిష్టసఖిని చూడటానికి బయలుదేరాను. ఆ రోజున బనాయించిన వేషం యినాటికి నాకు బాగా గుర్తుంది.

అమెరికన్ మెటీరియిల్ బ్లాకు పాంట్, ఇంగ్లీషు పాప్లిన్ క్రీమ్ కలర్ షర్టు, గోల్డెన్ డాట్సువున్న బ్లాక్ కలర్ ఫ్రెంచి టై, రోలెక్సు గడియారం.

ఇవి అన్ని కూడా ఎరువు సొమ్ములే కాని నిలువుటద్దంలో చూచుకుంటే నా విగ్రహం నాకే మనోహరంగా కనిపించింది.

చిరునవ్వు వచ్చింది. మనస్సులో చిన్నారి మసలింది.

సాయంకాలం సంజె చీకట్లు రాకముందరే వాళ్ళ యింటి దగ్గర నా టాక్సీ ఆగింది.

కారు దిగి నేను యింటి వంక చూశాను. చూస్తూ అల్లానే నిలబడిపోయాను.

పద్మ యిటువైపు నడిచివస్తోంది. హంస లాగా నడకలో మయూరిలాగా హొయలు చూపే ఆ వ్యక్తిని చూస్తూ నేను అల్లాగే నిలబడిపోయాను.

బంగారు రంగు పైజామా అదేరంగు కుర్తీ పైన లేత ఆకాశరంగు ముఖమల్ గుడ్డపై జరీ బూటాలు చిత్రించిన దుపట్టా.

అల లాగా కల లాగా కదలి వచ్చింది. నిలబడి నా వంక చిరునవ్వుగా చూసింది. వెన్నెల విరిసింది. ఒక్కసారి కోయిలలెన్నో కూశాయి.

నమస్తే అని తియ్యటి కంఠం పలికితే మిల మిల మెరిసే కన్నుల్లో వెయ్యి ఇంద్ర ధనుస్సులు ఒక్కసారి మిరుమిట్లు కొలిపాయి.

మంత్ర ముగ్దుడిలాగా నేను నిలబడే వున్నాను. కదిలిన కారు చప్పుడువిని

వులిక్కి పడ్డాను. అంతలోనే తెప్పరిల్లుకుని

నమస్తే ! అని అన్నాను.

బయటే నిలబడి పోయారేం ? లోపలకు రండి అంటూ ఆహ్వానం వచ్చింది.

ఎల్లా వున్నారు అని అడిగింది.

ఈ డ్రస్‌లో మీరు చాలా బాగున్నారు. యీ మాటలు అప్రయత్నంగానే నానోట పలికాయి.

పద్మ ఒక్కక్షణం నా వంక చూసింది. ఆ చూపులో ఆనందం కనిపిస్తోంది.

థాంక్యూ అని అన్నది.

ఇంట్లోకి వెళ్ళి వరండాలో కూర్చున్నాం. క్రొద్దిక్షణాలలో వేడివేడి టీ వచ్చింది.

ఢిల్లీ అంత అర్జెంటుగా వెళ్లిపోయారేం. అని నేను అడిగాను.

ఆ పిల్ల కొద్దిక్షణాలు ఏం మాట్లాడలేదు.

నాన్నగారు యింట్లో లేరా అని అడిగాను.

ఆఫీసు నుంచి యింకా రాలేదు... ఢిల్లీ పెళ్ళి చూపులకు వెళ్లాం

పెళ్లిచూపులు ఎవరికో నాకు అర్థమయింది.

పిల్లవాడు నచ్చాడా అని అడిగాను.

నవ్వి తల వంచుకుంది. నా గుండె ఝల్లుమన్నది.

పెళ్ళి ఎప్పుడు ?

సమాధానం లేదు.

ఈ మధ్య ఏదైన మంచి హిందీ పుస్తకం చదివారా అని తనే అడిగింది.

నేను సమాధానం చెప్పలేదు. నా మనస్సులో మసలిన మాటలు పెళ్ళి చూపులు.

ఆ పిల్ల ముఖం వంక చూశాను ఎక్కడో అనంతంలోకి చూస్తోంది.

పిల్ల బంగారు ఛాయ అని మణి వాళ్ళ మేనమామ అన్నమాట గుర్తుకు వచ్చింది.

ఎంత సన్నిహితురాలు అనుకున్న వ్యక్తి ఒక్క క్షణంలో ఎంతో దూరం వెళ్లిపోయినట్టి ఎంతో పరాయి మనిషి అయినట్లు అనిపించింది.

మూగనోము పట్టారేం

ఆనందం పట్టలేక

ఎందుకో ఆనందం

మిత్రులని చాలా కాలానికి కలుసుకున్న కారణం.

మీరు కవులా ?

మిమ్మల్ని చూసిన తరువాత

ఇద్దరం ఒక్కసారి ఫక్కున నవ్వాం.

సినిమాల్లో సంభాషణలు యిల్లాగే వుంటాయి కాదూ అని అంది.

జీవితాలు సినిమాలలాగా వుండవుకదా !

ఎందుకని ?

ఎన్ని కష్టాలు యిబ్బందులు వచ్చినా సినిమాలో కధ సుఖాంతమే అవుతుంది.

మరి జీవితం....

జీవితంలో, కష్టాలు తరువాత సుఖం తప్పక రావాలనే నియమం ఏది లేదు సుఖం కొద్దిమందికి, దుఃఖం అనేక మందికి.

నిజం ! అనేక మంది దుఃఖపడితేనే కాని కొద్దిమంది సుఖపడరు... జీవితం కూడా కధలాగా వుంటె.

అప్పుడు కధలతో పని వుండదు పద్మాజీ.

నన్ను పద్మా ! అని పిలవండి చాలు.

క్షమించండి. నేను అల్లా పిలువలేను.

ఎందుకని.

మిమ్మల్ని గౌరవించడం లోనే నాకు ఆనందం వుంది.

పెద్దలు పిన్నలని గౌరవిస్తే వారికి ఆయుక్షీణం అని మీకు తెలుసు కదా.

నేను మళ్ళీ సమాధానం చెప్పలేకపోయాను. ఓడిపోయాను అని అన్నాను.

పద్మ ఫక్కున నవ్వి అందులో ఆశ్చర్యం ఏముంది ?

ఎందుకని !

ఓడిపోయినట్టు నటిస్తూ స్త్రీ జయిస్తుంది. జయంపొందానని మభ్యపడుతూ పురుషుడు ఓడిపోతాడు.

జీవితసత్యాన్ని ఎంత సులభంగా చెప్పారు. ఈ విద్య అంతా ఎప్పుడు నేర్చుకున్నారండి.

మీ ఉపన్యాసం విన్న తరువాతనే

ధన్యుడిని

ఆ మాట అనవలసింది నేను.

ఇంటిముందు నల్లటి ఫియట్‌కారు వచ్చి ఆగింది. అందులోంచిదిగిన వ్యక్తి

పద్మవాళ్ళ నాన్నగారని చెప్పవలసిన అవసరం లేకుండానే తెలుస్తోంది. నన్ను చూడగానే ఆయన ఒక్కసారి పద్మవంక చిరాకుగా చూశాడు. అంతలోనే చిరునవ్వు ముఖంలోకి తెప్పించుకుని. పద్మచేసిన పరిచయాన్ని పురస్కరించుకొని నాతో చెయ్యి చెయ్యి కలిపారు.

నన్ను గురించి పద్మ చెప్పిన దంతా విన్నాడు.

"గ్లాడ్ టు మీట్ యూ" అని నాతో ఇంగ్లీషులో అని, పద్మతో పంజాబీలో

'ఎన్నిసార్లు నీతో చెప్పాను. అడ్డమయిన వాళ్ళని మన యింటికి తీసుకురావద్దని' నేను ఉలిక్కిపడ్డాను అంతలోనే ఆ మాటలు నాకు అర్ధంకానట్టు నటించాను.

పద్మ ముఖం ఒక్కసారి కందగడ్డ అయింది.

అందరూ నువ్వనుకున్నంత చెడ్డవాళ్ళ కాదు నాన్న ! అని పంజాబీలో సమాధానం చెప్పింది.

నేను ఒక్కసారి గడియారం వంక చూసుకున్నాను. వెంటనే వెళ్లిపోతే ఏమనుకుంటారో అని తమాయించుకుని కూర్చున్నాను. వాళ్ళిద్దరి వంకా చూద్దును కదా, పద్మ ముఖంలో బాధ కనిపిస్తోంది. ఆయన ముఖంలో కోపం కనిపిస్తోంది.

ప్రొద్దుపోయింది వెళ్ళి వస్తాను. నమస్తే అంటూ లేచాను.

పద్మ కూర్చున్న చోటు నుంచే నమస్తే అని అన్నది. ముసలాయిన అసలు మాట్లాడలేదు.

అంతులేని బాధతో అవమానంతో యింటికి తిరిగి వచ్చాను. మనస్సులో ఒకటే ఆలోచన ఒకటే ఆవేదన.

వెళ్ళిపోవాలి, యిక్కడ నుంచి దూరంగా వెళ్లిపోవాలి.

ఇంటి దగ్గర మణి, కమల నాకోసం ఎదురు చూస్తున్నారు. నన్ను చూడగానే మణి నవ్వుతూ

వెన్నెల వేడిగా వుందా ? చల్లగా వుందా ? అని అడిగాడు, నేనేం మాట్లాడ లేదు.

ఎంత ఘాటుప్రేమయో ఎంత లేత వలపులో అటూ కూని రాగంగా కమల అన్నది.

నేను వాళ్ళ యిద్దరి వంకా చూడకూడదనుకున్నాను చూస్తే నా కళ్ళల్లో నీరు అగేటట్టుగా లేదు.

ఒకసారిచూశాడో లేదో, నన్ను గురించి పూర్తిగా తెలియకుండానే ఆయన నన్ను గురించి ఎటువంటి చులకన అభిప్రాయం వెలిబుచ్చాడు.

నేను ఆయనకు చేసిన అపకార ఏమిటి ? అసలు నాలోని లోపమేమిటి ?

ఆ పెళ్ళి కూతురుకు నేను నచ్చలేదు. ఇక్కడ యీయన మెచ్చలేదు. రేపు మణి వాళ్ల శ్యామలకు మాత్రం నేను నచ్చుతానని నమ్మకం ఏమిటి ?

రేపు ఆ అమ్మాయి కూడా నాకు యీ కుర్రవాడు నచ్చలేదని అంటె ?

అంతకంటే నాకు యింకా ఏం అవమానం కావాలి.

రామం ! అంటూ మణికంఠం నాకు వినిపించింది. నేనేం మాట్లాడలేదు. సరాసరి వెళ్ళి నా గదిలో పడుకున్నాను.

కొంచం సేపటికి మణి వచ్చాడు.

ఏమిటిరా విశేషాలు అని అడిగాను.

సాయంకాలం పద్మవాళ్ళ యింటికి వెళ్ళాను. చాలా మర్యాద చేశారు.

పద్మ మమ్మల్ని గురించి ఏమన్నా అడిగిందా.

యీసారి వాళ్ళ యింటికి మీ దంపతులని తప్పకుండా వెంటబెట్టుకుని రమ్మన్నది.

దంపతులంటె గుర్తుకువచ్చింది. మీ నాన్నగారి దగ్గర నుంచి టెలిగ్రాము వచ్చింది. అని టెలిగ్రాము యిచ్చాడు.

మంచిరోజు చూసి పెళ్ళికూతురును చూసిరా అది దాని సారాంశం.

ఎప్పుడు బయలుదేరుదాం ? అని మణి అడిగాడు.

మంచిరోజు చూసి

ఎల్లుండి బాగుందని బాలచందర్‌గారు అన్నారు.

సరే.

మరునాడు లోకల్‌టపాలో "సాయంకాలం ఆక్వేరియం హోటలులో కలుసుకోవలసింది. పద్మ" అని ఉత్తరం వచ్చింది.

నన్ను గురించి చులకనగా మాట్లాడింది వాళ్ళ నాన్న కాని తను కాదుగా. బహుశ నిన్న వాళ్ళ నాన్నగారి ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకోవడం కోసం కాబోలు.

పద్మకు అనవసరంగా బాధ కలిగించటం నాకు యిష్టం లేదని, భవిష్యత్తులో మనం కలుసుకోకుండా వుంటమే మంచిదని నేను చెప్పివేస్తాను.

ఎవరిచేత అవమానించబడవలసిన అవసరం నాకు లేదు. గుడ్ బై పద్మా !

సాయంకాలం అయిదుగంటలు కొడుతూ వుండగా ఆక్వేరియం హోటలుకు వెళ్ళాను. అక్కడ పద్మ నాకోసం ఎదురుచూస్తోంది. ఆ వ్యక్తిని చూడగానే నా

మనస్సులోని ఆవేదన ఆరాటన మంచుతెరలాగా మాయమైంది. అర్థంకాని ఆనందం నన్ను ఆవరించింది.

చిరునవ్వుతో నన్ను పలుకరించింది. చిరునవ్వు బదులుపలికింది.

ఉద్యోగం చేస్తారా అని పద్మ అడిగింది.

ఎవరు యిస్తారు ?

మా నాన్నగారి స్నేహితుడు ఒకాయనకు యిక్కడ ఆటోమొబైయిలు వర్కుషాపు వుంది. ఆయనితో నిన్న రాత్రి మాట్లాడాను. మిమ్మల్ని వచ్చి ఒకసారి కలుసుకోమన్నారు.

మీనాన్నగారికి యీ విషయం తెలుసా ?

పద్మ ఏమి మాట్లాడలేదు.

పద్మాజీ ! మీతో ఒక్కమాట చెప్పనా ?

ఎంతో ఆతురతో నా వంక చూసింది.

చెప్పండి.

నాకు పంజాబీ కూడా వచ్చు.

ఈ మాటలు అర్థం కావటానికి పద్మకు అరక్షణం కూడా పట్టలేదు. ముఖం రెండు చేతులతో కప్పుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

ఐ యాం సారి పద్మాజీ ! నన్ను క్షమించండి అని అన్నాను. కొద్దిక్షణాలు యిద్దరం మాట్లాడలేదు.

మీరు నన్ను ఎంతో గౌరవించారు. ఎంతో ఆదరించారు. మీ స్వల్ప పరిచయంలోనే నేను ఎంతో ఆనందాన్ని పొందగలిగాను. కాని యీ స్నేహం వల్ల మీకు మీ స్వజనంతో విరోధం, కలహం ఏర్పడే పరిస్థితి నావల్ల ఎప్పటికీ కలగకూడదు. మీ నాన్నగారికి నా యందు చులకన అభిప్రాయం ఎందుకు కలిగిందో నాకు తెలియదు. తెలుసుకోగలనని కూడా అనుకోవడంలేదు. పద్మాజీ, నన్ను మరచిపోవడానికి ప్రయత్నం చెయ్యండి. నేను రేపే మదరాసు వదలిపోతున్నాను.

మళ్ళీ ఎప్పుడు వస్తారు.

తిరిగి రావాలని కోరిక లేదు.

పద్మ ఏం మాట్లాడలేదు. నా చేతిని తన చేతులలోకి తీసుకొని మమ్మల్ని క్షమించలేరా అని అడిగింది.

నేను సమాధానం చెప్పలేదు.

గుడ్‌బై పద్మా గుడ్‌బై ! అంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయాను ఎక్కడా ఆగలేదు వెనుక్కు తిరిగి చూడలేదు.

మరునాడు ఉదయం మదరాసు వదలి నేను మణి బయలుదేరి గుంటూరులో వున్న వాళ్ళ మామయ్యగారి యింటికి వెళ్ళాం. వాళ్ళ అమ్మాయిని చూశాం.

తోటలో మల్లెపందిరి దగ్గర కుర్చీలు వేశారు. నేను మణి వాళ్ళ మామయ్య కూర్చుని కాఫీ త్రాగుతున్నాం, ఇంతలో శ్యామల వచ్చింది. శ్యామలను గురించి వాళ్ళ నాన్న చెప్పినదాంట్లో ఎక్కడా ఎటువంటి అతిశయోక్తిలేదు.

బంగారు బొమ్మ, అందుకు సందేహం లేదు అమ్మవారి విగ్రహంలాంటి మనిషి.

ఆ పిల్లను చూడగానే వాళ్ళ నాన్న రాతల్లీ రా కూర్చో ! అని అన్నాడు కూర్చోటానికి ఆ పిల్ల ఒక్కక్షణం తటపటాయించినట్టు నాకు అనిపించింది.

కూర్చోండి అని అన్నాను.

థాంక్యూ అని అంటూ కూర్చున్నది.

రామం మణి బావకు ప్రాణస్నేహితుడు తల్లీ, మనకు పరాయివాడు కాదు మనవాడే అని ఆయన అన్నారు.

శ్యామల ఏమి మాట్లాడలేదు.

కూర్చుని మాట్లాడుకుంటూ వుండండి యిప్పుడే వస్తాను.

శ్యామల ఒక్కసారి వాళ్ళ నాన్న వంక చూసి తల వంచుకుంది. ఆయన నిజంగానే పని వున్నవాడిలాగానే అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

నేను మణి శ్యామలా మిగిలాం.

శ్యామలా, రామాన్ని గురించి నీకు ఎప్పుడైనా చెప్పానో లేదో కాని, మా రామం వండర్‌ఫుల్ మ్యాన్. అయిదారు భాషలు మాట్లాడతాడు, సంగీతం పాడుతాడు, కథలు రాస్తాడు, ఇవన్నీ కాకుండా పెద్ద యింజనీరింగ్ పరీక్ష ప్యాసు అయ్యాడు. యీ మధ్య మదరాసులో హిందీలో ఉపన్యాసం యిచ్చాడు. అందులో ఎంత బాగా మాట్లాడడంటే పోటీలో ప్రైజు రావడమే కాదు ఒక అమ్మాయి అమాంతం మన రామాన్ని లవ్‌చేసేసి వాడికోసమని మా యింటిదాకా వచ్చింది. నేను చెప్పానుగా నిజంగా మా వాడు వండర్‌ఫుల్ మ్యాన్ అంటూ గుక్క తిప్పకోకుండా ఉపన్యాసం యిచ్చాడు.

శ్యామల ఏం మాట్లాడలేదు. నావంక ఒక్కసారి చూసి తలవంచుకున్నది.

మణి అంటూ శ్యామలావాళ్ళ అమ్మ పిలిచింది.

వస్తున్నా అత్తయ్యా అంటూ మణి లోపలకు వెళ్లిపోయాడు.

నేను, శ్యామలా మిగిలాం ఒంటరిగా తోటలో.

కొద్ది క్షణాలు యిద్దరం మూగనోము పట్టాం.

కమల ఎల్లా ఉంటుంది ? అని శ్యామల హఠాత్తుగా అడిగింది.

ఎను ఉలికిపడ్డాను. I beg your pardan.

"ఏమీ అనుకోకపోతే. ఒక మంచి పాట పాడండి" అని శ్యామల అడిగింది.

కమల ఎల్లా వుంటుంది ? నేను శ్యామల వంక నిశ్శబ్దంగా చూశాను.

నాకు యింతవరకూ యీ విషయం ఎందుకు తట్టలేదు ?

మణికి యీడు అయిన యీ వ్యక్తికి పరాయి సంబంధం చూడటంలో ఉద్దేశ్యమేమిటో ?

కమల చామనచాయ, కన్ను, ముక్కు తీరు ఒడ్డూ పొడుగూ చాలా బాగుంటుంది. కాని మీ ముందు పోటీకి తగదు.

సంగీతం పాడుతుందా ?

చాలా బాగా పాడుతుంది.

మీరు కూడా చాలా బాగా పాడుతారటగా. బావరాసే ప్రతి ఉత్తరంలో సగం మిమ్మల్ని గురించిన పొగడ్తలే.

వాటిలో చాలా అతిశయోక్తులు వుండి వుంటాయి.

మీ విషయంలో మాత్రం కాదు... ఒక్కమాట చెప్పనా.

చెప్పండి !

నన్ను మొదటిసారిగా మీరు చూస్తున్నారు. బహుశ నన్ను గురించి మీకు అట్టే తెలియకపోవచ్చు. కాని మిమ్మల్ని గురించి మా ఇంట్లో అందరికి బాగా తెలుసు. మీరు కూడా మా కుటుంబంలోని వ్యక్తిలాగా అయిపోయారు. అందుకనే మీ దగ్గర యిల్లా పిచ్చిదానిలాగా మాట్లాడేస్తున్నాను.

నన్ను మీ ఆత్మీయుడుగా భావించడం నా అదృష్టం.

మీరు మాకెప్పుడు ఆత్మబంధువులే.

పెళ్ళిచూపులకు పెళ్లికొడుకు వస్తే ఆడపిల్ల సిగ్గు పడుతుందని, మాట్లాడటం కాదు కదా కన్నెత్తికూడా అతగాడివంక చూడటానికి బిడియపడటం చూశాం కాని యిల్లా ధైర్యంగా ఎన్నో సంవత్సరాల నుంచి పరిచయం వున్న వ్యక్తిలాగా యిల్లా మాట్లాడటం ఎక్కడా చూడలేదే.

ప్రపంచం విపరీతంగా మారిపోతోంది.

పెళ్ళి చూపులలో సంగీతం పాడేడ్యూటి ఆడపిల్లది.

ప్లీజ్

సరే తప్పకుండా 'నిదుర బరువులు నన్ను విడుచుటేనాడో' అన్న పాట పాడాను శ్యామల ముఖంలో నాకు ఆనందం కనిపించింది.

పెళ్లి కూతురిని కూడా ఒకసారి పాడవలసిందని కోరుతున్నాను. శ్యామల మీరా భజన్ ఒకటి పాడింది. మేరేతో గిరిధర్ గోపాల దూసరాన కోయీనహి !

యీసారి మెచ్చుకోవడం నా వంతు.

ఇంతవరకూ యిక్కడో మాయమైయిన మణి మళ్ళి ప్రత్యక్షమయ్యాడు. రాగానే శ్యామలతో

పిల్లవాడు పిల్లకు నచ్చాడా ? అని అడిగాడు.

ఆయన నీకంటె మంచివారేలే అంటూ శ్యామల అక్కడ నుంచి వెళ్లిపోయింది.

ఆ రోజు సాయంకాలమే బయలుదేరి మా వూరు వచ్చేశాను.

నాన్న పిల్ల ఎల్లావుంది అని అడిగారు.

బాగుంది. మీరు కూడా ఒకసారి వెళ్లి చూసిరండి అని అన్నాను. పిల్ల మనవాడికి నచ్చింది అని నాన్న అమ్మతో అన్నాడు.

వారం రోజులు యింటి దగ్గర గడిపానో లేదో కాని బెంగుళూరు నుంచి యింటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది.

అదంతా కాబోయే కోడలి అదృష్టం అని యింట్లో అంతా ఒక్కసారిగా శ్యామలను పొగిడారు.

బెంగుళూరు వెళ్లిపోయాక అక్కడ వున్న నాలుగు ఖాళీలను భర్తీ చెయ్యటానికి రెండు వందల మందిని యావత్ భారతదేశం నుంచి యింటర్వ్యూకూ పిలిచారు. వాళ్ళదేంపోయింది. ఇంటర్వ్యూకు ఎంతమంది వచ్చినా వాళ్ళు సెలెక్టు అయిన వాళ్లకేగా రైలు ఖర్చులు యిచ్చేది.

జనం కాశ్మీరు నుంచి కన్యాకుమారి దాకా వున్న వాళ్లంత వచ్చారు.

ఇంటర్వ్యూ ప్రారంభించిన నాలుగవ రోజున నాకు పిలుపు వస్తుందని వాళ్ళు చెప్పారు.

సరే చేసేదేం లేక కాలు కాలిన పిల్లిలాగా వూరంతా చెడతిరిగి, కనబడ్డ సినిమా అల్లాచూసి చిట్ట చివరకు ఇంటర్వ్యూకి వెళ్ళాను.

వాళ్ళు నా సర్టిఫికేట్లు వగైరా అన్ని గట్టిగా పరీక్షించి

రెండే రెండు ప్రశ్నలు వేశా[illegible].

వాటికి ఆటోమొబయిలు యింజనీరింగ్‌కు సంబంధం ఏమిటో యీనాటి వరకూ తెలియలేదు.

మొదటిది నీకు వివాహం అయిందా లేదా.రెండు మాంసాహారివా శాఖాహారివా?

రెండు ప్రశ్నలకు సజావుగానే సమాధానం చెప్పాను. సరే నేను వెళ్లవచ్చునని అనుజ్ఞ యిచ్చారు. ఆగదులోంచి బయటకు వస్తుండగా ఒక ఆయన లోపలకు వచ్చాడు. ఆయన నా వంక క్షణం తేరిపారచూసి చిరునవ్వు నవ్వి లోపలకు వెళ్లిపోయాడు.

నేను ఆశ్చర్యంతో అక్కడే నిలబడిపోయాను.

ఆయన పద్మవాళ్ళ నాన్నగారు.

ఆయనకు యిక్కడేం పని ? ఎందుకు వచ్చినట్టు యిల్లా అనేక ప్రశ్నలు వచ్చాయి.

వాటి సమాధానాల కోసం వెదుకుతూ నేను ఆ వూళ్ళో కూర్చోలేదు.

సాయంకాలం రైలులో బయలుదేరి మదరాసు తిరిగి వచ్చేశాను.

మదరాసు రాగానే మణి ఒక శుభవార్త చెప్పాడు. పెళ్ళికి ముహూర్తం నిశ్చయించారు సరిగ్గా పదిరోజులలో వివాహం.

ఇంకొక శుభవార్త ఏమిటంటె మా అమ్మ నాన్న వెళ్ళి శ్యామలను చూసి వచ్చారట జాతకాలు మా జోశ్యులవారు పరిశీలిస్తున్నారట.

కమలా వాళ్ళ యింట్లో పెళ్ళి పనులు మంచి జోరుగా సాగుతున్నాయి.

నన్ను చూడగానే కమల ముభావంగా వుంది. క్రొత్త పెళ్ళికూతురు కాబోతుంది. కనుక సిగ్గుపడుతోందేమోనని అనుకున్నాను.

కుర్చీలో కూర్చొని కదంబం దండ కడుతోంది.

ఎల్లా వున్నారు అని అడిగాను.

బాగానే వున్నాను. కొద్దిక్షణాలు ఎవరం మాట్లాడలేదు.

ఏమనుకోనంటె ఒక మాట చెప్పనా అని కమల అన్నది.

చెప్పండి.

రామంగారు నేను మీ చెల్లెలు లాంటి దాన్ని

కాదు మీరు నాకు వదినెగారు మణినాకు అన్నగారు.

పెళ్ళికాని ఆడపిల్లల బ్రతుకులతో చెలగాటం మానేయండి రామం !

నన్నెవరో ఒక్కసారి వెయ్యి కొరడాలతో కొట్టినట్టు అనిపించింది.

కమలా !

నాతో పద్మ అంతా చెప్పింది.

మీరు ఎల్లా ప్రవర్తించింది అంతా పూర్తిగా చెప్పింది.

అప్పుడు మీకు ఏమనిపించింది.

మీతో మాట్లాడకూడదని అనిపించింది.

నేను చెప్పింది కూడా వింటే మీకు పద్మతో మాట్లాడకూడదని అనిపిస్తుందేమో? ఒక్కమాట వినండి పద్మతో కలిగిన పరిచయం గురించి నేను అట్టే పట్టించుకోలేదు. ఆవిడ ఉపన్యాసం నన్ను బాగా ఆకర్షించింది. మనిషి కూడా చాలా మంచి వ్యక్తిలాగా కనిపించింది. ఆవిడను నేను ఎంత గౌరవంగా చూసినా, ఒక్క విషయం మాత్రం నేను ఎప్పుడూ మరిచిపోలేదు.

వాళ్ళకు మనకు ఏ విషయంలో కూడా సాపత్యంలేదు. నా బాధ్యతలు బంధుత్వాలు, నన్ను కొన్ని అవధులు దాటి బయటకు వెళ్ళనియ్యవు. నా జీవితం మా పల్లెటూరులో గడిచిపోవలసిందే. పల్లెటూరులో వుండి కూడా బయట ప్రపంచంలో నాకున్న సంబంధాలు తెగిపోకుండా వుండడం కోసమే ఆకాంక్షపడటానికి కారణం ఈ ఆకాంక్షనాలో నాలో నశించిన నాడు. నేను కూడా నామరూపాలు లేని అనేక కోట్ల మంది వ్యక్తులలో ఒకడిని అవుతాను.

పద్మ యడల నా అభిప్రాయం ఎటువంటిదో తెలుసుకోకుండానే మీరంతా ఎన్నో ఊహాగానాలు చేశారు.

పద్మ పెళ్ళి సంబంధం చూడటం కోసం ఢిల్లీ వెళ్లి వచ్చింది. వాళ్ళ నాన్న అవమాన పరుస్తూంటే మాట్లాడకుండా వూరుకుంది. నేను తన ఆహ్వానం మీదనే వాళ్ళ యింటికి వచ్చానని చెప్పే ధైర్యం లేక పోయింది. మీరు కూడా ఆరోజు నా వెంట వచ్చివుంటె ఆయన మిమ్మల్నికూడా నాతోబాటు అవమానంచేసి వుండేవాడు. ఆయన ప్రవర్తనకు క్షమార్పణ చెప్పికోవలసింది పద్మనూ నేను కాదు. ఎవరి మనస్సులతోనూ చెలగాటమాడదామనే కోరిక నాకు ఎప్పుడు కలగదు.

మీది రాతి గుండె.

నన్ను యీసడించిన వాళ్ళని పూజించడం నాకు చేతకాదు.

నేను పరుగెత్తుకుంటూ వెళ్ళి పద్మ పాదాల మీద క్షమార్పణ కోరుకుంటె నాది చాలా మెత్తని మనస్సు అని అనుకుంటారనుకుంటాను.

రామం

మణి గొంతుకు విని నేను ఉలిక్కిపడ్డాను.

పెళ్ళి పనులలో సాయం చెయ్యటానికి బదులు పోట్లాడతున్నావేమిటిరా ?

నేనేం మాట్లాడలేదు. సరాసరి పానగల్ పార్క్కుకు వెళ్లి కూర్చున్నాను. మనస్సు విరిగిపోయింది. మదరాసు వదలి వెళ్లిపోవాలి. ఇంటికి వెళ్లిపోతాను. నాన్నకు సహాయంగా వుంటాను. గుడ్‌బై ! మదరాసు ! గుడ్‌బై !

రేపే వెళ్లిపోతాను.

నో ! నో !

పది రోజులలో మణికి పెళ్ళి. పెళ్లికి వుండకుండా వెళ్ళిపోతే నన్ను భగవంతుడు కూడా క్షమించడు.

ఓ.కె. ! కమల పెండ్లి అయిన తరువాత వెళ్లిపోతాను.

మరునాడు నుంచి పెండ్లి పనులలో మునిగిపోయాను. కమల ఎప్పుడూ కూడా పద్మ విషయం ప్రస్తావించలేదు.

పది రోజులు పది ఘడియలుగా గడిచిపోయాయి. పెండ్లి రోజు వచ్చింది. ఆబట్సుబరీలో వివాహం జరిగింది. సాయంకాలం టీ పార్టి సందర్భంలో ఒక చిన్న పాటకచ్చేరి జరిగింది. అందులో యిద్దరు పాడారు, నేను, శ్యామలా చెరి గంట సేపు పాడాం. కమలకు నచ్చిన పలుకరాదటె చిలుకా శ్యామలకు నచ్చిన నిదుర బరువులు విడుచుటేనాడో పాటలు పాడాను. యీ పాట పాడుతూ వుండగా పద్మ వచ్చింది. ఆ పిల్లను చూసిన తరువాత యిహ పాడలేకపోయాను. పాడుతున్న పాట పూర్తిచేసి స్టేజి దిగి వచ్చేశాను.

నన్ను చూడగానే తనే చిరునవ్వుతో పలుకరించింది. ఖాళీగా వున్న ఒక కూర్చీ దగ్గరకు పద్మను తీసుకు వెళ్ళాను. కూల్‌డ్రింక్ వగైరా తెప్పించాను.

పద్మ యివేం ముట్టలేదు.

నేను బలవంత పెట్టాను.

కోపం పోయిందని హామీ యిస్తేనే కాని నేను ఏమి తినను అని పద్మ అన్నది.

ఎందుకనో నాకు యీనాటికీ అర్ధంకాదు. ఆపిల్ల మాటలు వినగానే నాకు అకస్మాత్తుగా కళ్ళవెంబడి నీరు తిరిగింది. తను చూడకూడదని ముఖం పక్కకు తిప్పుకున్నాను.

కనబడకూడదనుకున్నావా రామం

నేను ఆ ప్రశ్నకు సమాధానం ఏం చెప్పలేదు కాని నేను యింకొక ప్రశ్న వేశాను. ఎందుకు పద్మాజీ. నేనంటే మీకు యింతయిష్టం ?

అదే నాకు అర్థం కాదు రామం ! నిన్ను ఎన్నో జన్మ జన్మల నుంచి తెలిసినట్టు

అనిపిస్తుంది. మీరు నాకు అత్యంత ఆత్మీయులని నా మనస్సు పదే పదే వక్కాణించి చెబుతుంది నా మనస్సు నాతో అబద్ధం ఆడదుగా రామం.

మీతో పరిచయం నా జీవితంలో మరువలేని మధురమైన అధ్యాయం పద్మ.

నేనూ అల్లాగే అనుకుంటాను రామం. రేపు ఢిల్లీ వెళ్లిపోయిన తరువాత కూడా.

ఢిల్లీ వెళ్లిపోతున్నావా ?

రేపు జీటిలో వెళ్లిపోతున్నాం. నాన్నగారికి ఢిల్లీలో మంచి ఉద్యోగం దొరికింది.

మదరాసులో నువ్వు లేకపోతే చాలా బాధగా వుంటుంది పద్మ.

రామం, ఒక్క చిన్నమాట చెప్పనా.

చెప్పు పద్మా.

వచ్చే నెల పదవతేదీ ఉదయం ఎనిమిది గంటలకు మీరు ఢిల్లీలో మాయింట్లో వుండాలి.

ఎందుకని

మాయింట్లో పెండ్లి.

ఎవరిదని నేనే కాదు, ఎవరూ అడగవలసిన పనిలేదు.

కంగ్రాచ్యులేషన్సు అల్లాగే వస్తాను.

థాంక్సు

మరునాడు ఉదయం జీ.టి.కి వెళ్లాను. పద్మ వాళ్ళ నాన్నగారు పలకరించారు.

ఉద్యోగం విషయం తెలిసిందా అని ఆయన అడిగారు.

ఇంకా లేదండి.

వస్తుందిలే నీ మార్కులు అవీ చూశాను. గుడ్ ! బాగున్నాయి ఇవ్వమని రికమెండు చేశాను.

థాంక్సు అని పైకి అన్నాను. కాని మనస్సులో అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చాను. ఈ ఉద్యోగం నాకు అక్కర్లేదు.

పద్మ నేను రైలు కంపార్టుమెంటుకు రవ్వంత దూరంగా వచ్చి నిలబడ్డాం ! రైలు కదలటానికి ఒకటి రెండు నిముషాలకన్న వ్యవధి లేదు. ఆ స్వల్ప వ్యవధిలోనే పద్మనాతో తన మనస్సులోని మాట మనస్సు విప్పి చెప్పింది.

మరిచిపోతావా రామం అని అడిగింది.

ఎప్పటికీ మరిచిపోను.

చూడు రామం నేను నాజీవితంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభించ బోతున్నాను. మీరు కూడా యీ చిన్నతనం మానెయ్యాలి. మనం కూడా పెద్దవాళ్లం అవుతున్నాం. పెద్దవాళ్లకు వుండె బాధ్యతలు స్వీకరించడానికి భయపడ్డరోజున మనం జీవితంలో అడుగడుగునా అపజయమే పొందుతాం. మీరు చక్కటి గృహిణిని చేపట్టి జీవితానికి ఒక అర్థాన్ని ఒక గమ్యస్థానాన్ని సృష్టించుకోండి. కాలాన్ని వ్యర్థంగా వెచ్చబెట్టకండి.

గార్డు యీల మోగింది. పచ్చజండా వూగింది. యింజను ఒక్కసారి ఎలుగెత్తి ఆక్రోశించింది. పద్మ ఢిల్లీ వెళ్లిపోయింది.

ఆనాటికీ యీనాటికీ పద్మ కనిపించేది కలల్లోనే, వినిపించేది ఒంటరి హృదయంలోనే. పెండ్లి అయిన వారం రోజులలో మణి, కమల హనీమూన్‌కు ముసోరి వెళ్లారు. సెలవపెట్టి బాలచందర్‌గారు వాళ్ళ స్వగ్రామం వెళ్ళారు. శ్యామల గుంటూరు వెళ్లింది. మా గార్డియన్ నటరాజన్ రిటైరు అయిపోయి సేలం వెళ్ళాడు. ఎవరితోను చెప్పకుండా నంజుండయ్య కూతురు కన్నియమ్మ, అప్పుడప్పుడు దీనికి సంపెంగ పువ్వులు యిచ్చి ప్రేమపాఠాలు నేర్పిన ఎదురింటి పనివాడిని, వడపళని గుడిలో ప్రేమ వివాహం చేసుకుంది. ఆ విషయం తెలిసి వాళ్ళ నాన్న ఒక అరగడియ సేపు పెడబొబ్బలు పెట్టినా, కూతురు పెండ్లి కానీ ఖర్చు లేకుండా జరిగింది పోనీలే అని తనని తానే సమాధాన పరుచుకున్నాడు.

ఆరోజు దశమి, శుక్రవారం-మదరాసుకు గుడ్‌బై చెప్పి మా వూరుకు వచ్చేశాను.

మనస్సులో ఒకే ఒక సంకల్పంతో యింటికి బయలుదేరాను. శ్యామలను వివాహం చేసుకుని, యింటి దగ్గరే వుండి నాన్నకు సహాయంగా ఎస్టేటు మ్యానేజిమెంటు చేసుకోవాలి.

ఇంటికి చేరాను. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అమ్మకాని, అమ్మమ్మకాని, పెండ్లి విషయం ప్రస్తావించలేదు. భోజనాలు అయిన తరువాత నాన్న గదిలో కూర్చుండగా ఆయనే అన్నాడు.

శ్యామలా వాళ్ళ నాన్నగారు ఉత్తరం రాశారు.

ఏమని ?

శ్యామలకు నీకు జాతకాలు కలవలేదట.